# గాంధర్వము

(ఏకాంకరూపకము.)

ఉదయము అయిదుగంటల నర.

[బ్రాహ్మణవీధిలో తూర్పుముఖంగా పెద్దమేడ; సావిట్లో విశాలమైనగది. సావిట్లోనుంచి గదిలోనికి వొక ద్వారమూ గదిలోనుంచి వెనక చీడీలోనికి వొకద్వారమూ వుంటాయి. మేడకు వెనక యిరవై ముప్పైగజాలదూరాన వంటలకూ భోజనాలకూ దగిన సదుపాయాలతో నిర్మింపబడిన పెద్ద హాలు. మేడకూ వెనకటి వసారాకూ మధ్య విశాలమైన వాకలి, వాకట్లో మధ్యనుంచి వెనకటి వసారాచెంతకు పాలరాతిపలకలు అమర్చబడిన మార్గము. మార్గమున కిరుపక్కలా రకరకాల పువ్వుల మొక్కలూ క్రోటన్సుమొక్కలూ వుంటాయి. వాకట్లో వొకపక్కనుంచి మాధవీలత వొకటి పందిరిపై ప్రాకి మార్గము మధ్యను గుబురుగా అల్లుకునివుంటుంది. దానికింద నున్నని పాలగచ్చుతిన్నె చూసిన వారికి పనిలేకపోయినా తప్పక వొకసారి కూచోవాలని బుద్ధిపుట్టిస్తూవుంటుంది. దానికెదురగా దృఢమైన టేకుబెంచీ, దానికిరుపక్కలా చిత్రవస్తుప్రదర్శనశాలలో వుండడానికి తగిన నాలుగైదు కుర్చీలూ వుంటాయి. వెనకటింటి చీడీఅంచున నరసమ్మ సుమారు నలభై అయిదేళ్ళ వితంతువు కూచుని అప్పుడే కడుగుకున్న ముఖాన్ని పైటచెరగుతో వొత్తుకుంటూ వుంటుంది. ముందరింట్లోనుంచి సీతారామ సుమారు యిరవైయేళ్ళ అమ్మాయి ఆనుకేసి హడావుడిగా వస్తూవుంటుంది]

సీతారామ (ఆదుర్దాతో):—అమ్మోయి!

నరసమ్మ (ఉలికిపడి):—ఏమిటీ...?

సీ (గుండెబాదుకుంటూ):—అమ్మ! అమ్మ...! ఏంఘోరణం! ఏంఘోరణం!!

న (ఆతృతతో):—ఏమిటదీ?—

సీ:—ఎంతపనికి సాహసించిందీ!

న (చిరాకుతో):—అబ్బా!... ఏమిటీ అదీ—సరిగా చెప్పకా?

సీ:—ఏంచెప్పనూ! సిగ్గ సిగ్గ...మీకోడలు—లేచి—పోయిందిటా!

న (అదిరిపడి):—ఆఁ? ఏ—మి—టీ...! ఎవరిమాటా నువ్వంటున్నదీ—?

సీ:—ఎవరిమాట? మీ కోడలి మాటే! అన్నయ్య పెళ్లాం మాట...మా వొదినగారి మాట!!

న (కొంచెంకోపంతో):—ఛీ, నోరుముయ్యి—ఏమిటా యెగతాళీ!

సీ:—ఎగతాళి! ఎగతాళీ యేమిటీ! నిజం చెబుతూవుంటే!

న (గాభరాపడి):—ఆఁ...! నిజమే! ఒట్టే!!...నన్ను చంపుకుతిన్నట్టే!!!

సీ:—నిజమేనమ్మా! నీతోనాకు హాస్యమేఁమిటీ?

న:—ఎవరు చెప్పారూ?

సీ:—ఎవరు చెప్తారూ? అన్నయ్యే చెప్పాడు.

న:—ఎవడితోనూ?

సీ:—ఎవడో నారాయణ—

న:—అయ్యో! ఆ వెధవతోనే? ఎంతపనికి నెట్టుకుంది? ఛండాలురాలు! నే మొదణ్ణించీ అనుమానిస్తూనే వున్నాను—యిదెల్లాగూ తిన్నగా మనవదనీ. లేకుంటే కాపరంచేస్తున్న ఆడదానికి సిగ్గూ--అభి

మానం—యేమీ లేకుండా ఆ పరాయివెధవతో ఆ షికార్లూ, ఆ స్నేహం, ఆ నవ్వులూ, చూపులూ... అయితే యెప్పుడు దాటేసిందీ?

సీ:—రాత్రి యే వొంటిగంటప్పుడోనట్టా!

న:—అర్ధరాత్రే! అన్నట్టు—ఆ నగలు?... అయ్యో! వొంటివొంటెడు నగలు!— కొంప ముంచేసింది! ఇంకేంవుందీ ..? సంసారం ధ్వంసంచేయిాసింది! ఏందారి? డెభ్భై యెనభై తులాల బంగారం—ఆ పాళ్ళ సరుకులూ—అన్నీ నట్టేట్లో కలిసినట్టే! అయ్యయ్యయ్యో! ఏంసాధనం? వీడింకా యేంచేస్తున్నాడూ?—ఆ గదిలోని—?

సీ:—ఏదో వుత్తరం రాస్తున్నాడు—అదిగో వస్తున్నాడు—

[ధర్మారావు సుమారు యిరవై అయిదేళ్ళవాడు. దేహచ్ఛాయ కొంచెంనలుపు. సామాన్యమైన పొడుగు; అయినా లావు మీద కొంచెం పొట్టిగా కనిపిస్తాడు. ముఖం ప్రబంధకవులు వర్ణించినట్టూ గుండ్రంగానే వుంటుంది. ఆముఖానికి కళ్ళు కొంచెం చిన్నవిగానూ నోరుకొంచెం పెద్దదిగానూ కనబడుతూ వుంటాయి. అతని మనోభావాలనెన్నడూ అతడు వెలిబుచ్చడు. అయినా వాటిని కప్పిపుచ్చడానికి ప్రయత్నించినట్టు కూడా కనబడదు, అందంగా కనబడాలని లోన ఎంతప్రయత్నిస్తున్నా పైకిమాత్రం ఆ తలంపే లేనట్టు యెంతో ఉపేక్షాభావం నటిస్తాడు. నలిగిన అతనికళ్ళూ, రేగినజుట్టూ రాత్రల్లా అతడు నిద్రలేకుండా దుఃఖించినట్టూ రూపిస్తాయి. అతడు తలకొంచెం వంచుకుని జోగుతూ నెమ్మదిగా తల్లిచెంతకు వస్తాడు.]

న (కుమారునుద్దేశించి):—ఏంనాయనా! చూశావా?...ఎంతవరకూ మునిగిందో! దీనితరహా చూస్తే యేం బాగులేదు; ఎప్పుడోనాడు దగా చేశాటట్టూ వుందని నీ కెన్నిసార్లు చెప్పానూ? నామాటేం వినిపించుకున్నావా? గడ్డిపరకంత ఖాతరీచేశావా! దాని స్వభావం నీ కర్థంకాదు. అనట్లాంటిమనిషి కాదన్నావే! ఎట్లాంటి మనిషో యిప్పుడర్థమయిందా అబ్బాయికీ! ఆ నగలన్నీ నట్టేట్లో కలిసినట్టేనా? వాటికి నీళ్ళు వారేనా?

ధర్మారావు (శుష్క కంఠంతో):—ఏమిటా ఖంగారూ? నగ లెక్కడికి పోయేయి?

న (విస్మయంతో):—ఆఁ! పోలేదూ! వున్నాయా! దాచావా?

ధ:—నే దాచలేదు. కాని—

న:—కాని—? మరెవరు దాచారు? ఎవరు దాస్తారూ? ఇంకా వుంటాయనే నమ్ముతున్నావు!

ధ:—నమ్మకేంచెయ్యనూ? కళ్ళారా చూసి—

న (హాశ్చర్యంతో):—చూశావూ! ఎక్కడ చూశావూ? కల్లోగాని కాదుగదా?

ధ:—కాదు—గాని కల్లోకూడా అటువంటిది చూస్తానని యెన్నడూ అనుకోలేదు—

న (ఆతృతతో):—ఎందుచాతా?... ఏమిటీ... చెప్పు.

ధ:—వినుమరీ—అర్ధరాత్రే ఆమె వెళ్ళిపోవడం చూస్తే నగల్తో దాటేసివుంటుందనే నాకూ అనుమానం కలిగింది. ఇంతలో హఠాత్తుగా మంచంకింద ఆమె నగలపెట్టె కంటబడేసరికి యేమున్నాయో చూడాలని బుద్ధిపుట్టింది. దగ్గిరికి వెళుదునూ తాళంకూడా దాన్నే వుంది, అందుచాత ఖాళీ అయివుంటుందన్న నమ్మకంతోనే పెట్టెతెరిచాను. [illegible]ని చూతునూ—నా హాశ్చర్యం యేంచెప్పను? [illegible]మో లేక మేలుకుని కంటున్న స్వప్నమో నాకే తెలీ[illegible]. ఆ గడియారపు గొలుసూ, నానుపేటా, జిగినీ, ముత్యాలహారం, బంగారు రిస్టువాచీ, గాజులూ, మువ్వలవడ్డాణం, పెళ్ళినాడుపెట్టిన వుంగరం అన్నీ వేటిస్థానంలో అవి నా కళ్ళముందు ధగధగా మెరిశాయి. నాకళ్ళు మరి చూడలేకపోయాయి—

న:—నిజమే. కలకాదు—

ధ :—ఆఁ కతే! నీవుకూడా కనబడుతుంది. చెల్లీ మంచంకిందవున్న ఆ నగలపెట్టె తీసుకురా అమ్మా.

[సీతారామ తొందరగావెళ్ళి నెమ్మదిగా నగలపెట్టెను తీసుకువచ్చి తల్లినుండు తెరచి జాగ్రత్తగా వొక్కొక్కనగా పైకితీస్తూ వుంటుంది. తల్లికళ్ళు పెద్దవిచేసి హాశ్చర్యంతో వాటిని చూస్తూ వుంటుంది]

సీ :—దీనిల్లు బంగారంకానూ. ముక్కుపుల్లా తలపిన్నూ దగ్గర్నించీ యెంతజాగ్రత్తగా అమిర్చిందో? అన్నయ్యా. ఇదేదో వుత్తరంకూడా—

ధ (అదిరిపడి అంతలోనే సంబాళించుకుని):—ఏదీ?

[ఆమె అందివ్వగానే వొణుకుతున్న వేళ్లతో వుత్తరంవిప్పి ఆత్రతతో పంక్తులవెంట తన కళ్ళను నెమ్మదిగా నడిపిస్తాడు. హఠాత్తుగా అతనికళ్ళనుంచి రెండు నీటిబొట్లు చింది వుత్తరంపైన రాల్తాయి]

న :—ఏం రాసింది?

ధ :—చదూ. (తిరిగి చెల్లెలిచేతికందిస్తాడు.)

సీ :—(చదువుతుంది.)

శ్రీ ధర్మారావుగారికి—

మీతాలూకు నగలుగాని సొత్తుగాని యేమీ నాతో తీసుకువెళ్ళలేదని నమ్ముతున్నాను. మీరు నామీద అంతప్రేమా, ఆదరం చూపుతూవుంటే నేనింత కృతఘ్నతగా ప్రవర్తించడంచూసి చాలా కఠినాత్మురాలిననీ నీచురాలిననీ భావిస్తారు. కాని దేముడు నన్నిలా చేశాడు. నేనెంత నీచురాలినని మీరు భావించినా నా మనస్సంతా, హృదయమంతా ఇంకొకరిమీద వున్నప్పుడు దానిని కప్పిపుచ్చి మీమీద దొంగప్రేమ నటించేపాటి నీచురాల్ని మాత్రం కాను. ఎంత ప్రయత్నించినా కాలేకపోయాను. అట్లాకాకుండా ఇంకెట్లా అయినా మీయందు నాకున్న గౌరవం, విశ్వాసం మీకు తెలియజేయగలిగితే... మీకానందం కలిగించగలిగితే నావిధిని నెరవేర్చానని నమ్ముతాను. నాయందు మీరుచూపిన ఆదరణకీ, ఉదారభావానికీ జన్మజన్మాంతరాలవరకూ మీకు కృతజ్ఞురాలిని—

ఇట్లు,

సుందరి—

న :—ఇంతవరకూ నువ్వీవుత్తరం చూడేలేదు—

ధ :—ఊఁహూఁ.

న :—అయితే యింతసేపాయి యేంచేస్తున్నావూ?

ధ :—...........

న :—ఇంకొకళ్లా యెవళ్ళకీ వుత్తరం రాస్తున్నావటా—

ధ :—మామామ—కాదు, శ్రీనివాసరావుగారికి.

న :—దేనికీ?

ధ :—మరిదేనికి? అతనొస్తే యీ విషయమై అతన్తో ఆలోచించాలని—

న :—ఆలోచించి యేంచెయ్యాలనీ వుద్దేశం?

ధ :—ఏమో. ఇప్పుడేం చెప్పలేను. కాని—వివాహమనగా యేమిటో, భర్తఅంటే యేమిటో తెలీని బాల్యావస్థలో ఆమె అనుమతి తీసుకోకుండా నాకు కట్టబడినంతమాత్రాన వొక అమాయకపు బాలిక యొక్క—

న :—ఓ.. అమాయకురాలు. ఎంత అమాయకురాలు కాకుంటే కట్టుకున్న భర్తనువొదిలి అర్ధరాత్రే లేచిపోతుంది? ఘంటాలురాలు. కృతఘ్నురాలు—

సీ :—ఉస్. అదిగో. అత్తయ్య వొస్తూంది.

[అందరూ వీధిద్వారముకేసి చూస్తారు. వెంటనే చీడీదిగి వాకిటిమధ్యనున్న మాలతీ పందిరను సమీపిస్తార్థు. నరసమ్మా సీతారామా ఆ పందిరకిందనున్న గచ్చుతిన్నెపైన చతిగిలపడతారు. దాని కెదురుగావున్న టేకు బెంచీపైన ధర్మారావు జేర్లబడతాడు. సావిడిద్వారముతన్న రాజలక్ష్మి మెల్లగా

ప్రవేశించి నరసమ్మ చెంత తలవాల్చుకుని వోరగా నిలుచుంటుంది. ఆమె ముఖము విచారసూచకంగా వుంటుంది. వయస్సు ముప్పై అయిదేళ్ళలోపు.]

న (రాజలక్ష్మినుద్దేశించి) :—వొదినా! చూశావా? ఈ నాటకమంతా యెల్లావుందో!

రాజలక్ష్మి (విచారంతో):—ఏం చెయ్యనూ—? ఈ సంగతివిన్న దగ్గిర్నించీ మనసులో నేనెంత యేడుస్తున్నానో, యెంత కుమిలిపోతున్నానో ఆ పరమాత్ముడి కెరుక! జెప్పపని—కోతి పని చేసింది—మీ ముఖం చూడ్డానికే సిగ్గువేస్తూంది—

న :—అది మాయింటికి వచ్చిందిమొదలు యెంత చేశానూ? ఎంతముద్దుగా, యెంత గారాబంగా చూసుకున్నానూ?—

రా :—ఆసంగతి మీరు చెప్పాలా ?

న :—దాని తిండికిగాని, ముస్తాబుకిగాని, ఆటలకిగాని వొక్కనాడేనా యేమేనా లోటుచేశామా? ఇంత చేసినందు కేమేనా విశ్వాసముంచిందా? ఇలా బుద్ధి చెబుతుందా?

రా :—వొదినా ! ఏదో జరిగిపోయింది—అదంతా మీరు మరచిపోవాలి! ఇదిగో—, నా మొహం చూడండి! మీ పాదాలుపట్టుకుని వేడుకుంటున్నాను. అదంతా వొక చెడ్డకల అనుకోండి! ఏమీ జరగనే లేదనుకోండి! ఆసంగతి మరి తలబెట్టకండి! మళ్ళీ అటువంటి పాడుపనిచేస్తే మరిదాన్ని మీగుమ్మం తొక్కనీకండి! ఈసారికిమాత్రం యెలాగో గడిపుచ్చుకోవాలి! ఇదంతా మీకడుపులో పెట్టుకోవాలి!

న :—కడుపులో పెట్టుగోక యేంజేశానూ?

రా :—నిజమే, లేదని—

సీ :—అయితే మామయ్య యింటోలేడా యేమిటి? ఎక్కడికి పనిమీద—

రా :—ఆఁ పని? పనిమీద వెళ్ళినట్టేవుంది మా బతుక్కి. ఇంతకన్న యేంపనీ? దాన్ని తీసుకురావడానికేవెళ్ళారు అతనూ మా అన్నయ్యానూ.

న :—ఇంకా అదివొస్తుందనే నమ్మకం?

రా :—ఆఁ! రాకేంచేస్తుందీ? పసితనం! వొకసారి గడ్డితిని యేదో అవకతవకపని చేసింది. వాళ్ళనాన్న, మామయ్య గట్టిగా నాలుగు చీవాట్లువేస్తే అదే తిన్నగావుంటుంది! ఏంచెయ్యనూ! మా గర్భవాసం వొకటీ అవొకటీకాదు. అంతకన్న నేనేం చెప్పలేను.

న :—నువ్వింత చెప్పాలా మాకూ? దానికంటె మా కెవరున్నారూ? ఎంతముచ్చట పడ్డామూ? ఎంత ఆశ పెట్టుకున్నామూ? ఇంక మీ అల్లునిసంగతి మీకు తెలుసు కదా? ఎన్నడేనా దానియిష్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించాడా? ఎంత ఆప్యాయంతో చూసుకున్నాడూ! ఒక్కనాడేనా వొక్కదెబ్బకాదు గదా, పల్లెత్తుమాట అని—

రా :—అమ్మమ్మ! అతడ్నెవరేనా అనుకోగలరా? అతను నిజంగా ధర్మరాజే. ఈకాలంలో పుట్టవలసిన మనిషికాడు.

న :—అందుకే అది ఆడిందిఆటా, పాడిందిపాటా అవుతూంది. లేకుంటే కాపరంచేస్తున్న పడుచుపిల్ల ఆ పోకిరీవెధవతో ఆ నవ్వులూ, ఆకళ్ళ విసుర్లూ, ఆ షికార్లూ, చెలగాటలూ... ఎవరు సహిస్తారూ?

రా :—ఆ మూర్తిగాడితోటేనా?

న :—ఇంకెవడితోనూ ?

రా :—అయ్యో! ఆ వెధవపీనుగ యెక్కడకూడా యెలా దాపరించాడూ శనిగ్రహంలాగా, జానపాలూ పీడూ పాడుమొహం వేసుకుని—?

న :—అదివరకు వాడి మొహమేమిటో సంగతేమిటో మే మెరగం. మీపిల్ల మాయింటికివచ్చిన వారం రోజుల్నాడే మొదటిసారి వాడు మాగుమ్మం తొక్కడం ఆవేళమట్టుకు యేదో ముక్తసరిగా మాటాడి వెళ్ళిపోయాడు. ఆ మర్నాటినుంచీ ప్రతిరోజూ రెండుపూట్లా హాజరూ! మీపిల్లతో బాగా చనువుచేసుకున్నాడు. అంతకంతకూ భోజనానికి యేం వెళ్ళావాడో. ఎప్పుడూ యిక్కడే బస. ఇహనేముందీ? మీ అమ్మాయితో యెకసెక్కాలూ, చీట్లాటలూ, ఓ—పాటలూ, పద్యాలూ, కథలూ, కబుర్లూ వొహటేమిటి? ఎగరగొట్టేశాడు. వీడి వ్యవహారంచూస్తే యేం బాగులేదు—

వీణ్ణిల్లుచేరనివ్వడం మంచిదికాదని శతపోరాను. కాని నామాటేం వినిపించుకున్నాడా? వాడటువంటి మనిషి కాడు. బాల్యంనుంచీ వాళ్ళిద్దరూ వొక్కచోటే కలిసి మెలిసి వుండడంచాత చనువుగావుంటారు. అని నా మాట వొట్టిపోల్లుకింద కొట్టేశాడు.

రా (ధర్మారావు నుద్దేశించి):—అయ్యో! ఎంత అమాయకుడివి బాబూ! ఇప్పటిలోక మెల్లావుందో నువ్వెరగవు; ఆ వెధవసంగతి నీకు తెలిసిందికాదు—

ధ :—బాగుంది!—వాడిసంగతి నాకు తెలీకపోవడమేమిటి? పూర్తిగా తెలుసు. వాడు పదుచువాడూ, చూడ్డానికి చాలా అందంగావుంటాడూ, సరసంగా మాటాడుతాడూ, యింగ్లీషుకూడా బాగా చదువుకున్నాడూ, మంచి భావనాశక్తి కలవాడూ, కథలూ అవీ చక్కగా రాస్తాడూ—

రా :—వెధవకథలు—ముష్టివెధవ కథలూ, ముష్టివెధవ రాతలూనూ! వాడు కథలురాస్తే యెవరిక్కావాలి? రాయకపోతే యెవరిక్కావాలి? ఆ సంగతి కాదు నే అంటున్నది—

ధ (కోంటెగా):—మరే సంగతీ?

రా (కొంచెంతీవ్రంగా):—వాడొట్టి పోకిరీవెధవ—ఆడంగిపీనుగ—చిన్నప్పట్నించీ వాడిమోస్తరొక్కలాగేవుంది. ఆడవాళ్ళతో సిగ్గుమాలిన తిరుగుళ్లు తిరగడం వొక్కటే వాడికిచాతౌను. వాడే మాపిల్లని పాడుచేశాడు—బంగారంలాంటి మాపిల్ల మనసులో దురూహాలు ప్రవేశపెట్టాడు—

ధ :—దురూహాలో మంచివూహాలో నాకు తెలీవు—కాని, (చిరునవ్వుతో) మీపిల్లను బాగా మంత్రించి వలలో వేసుకున్నాడు. ఆమె శరీరాన్నీ, మనస్సునీ, ఆత్మనీకూడా పూర్తిగా లాగేశాడు—

రా :—అయితే ఆసంగతి నీకు తెలుసూ? ఎప్పుడు తెలిసిందీ?

ధ :—ఎప్పుడేమిటు? మొదట్నించీ తెలుసు.

రా :—ఆఁ! మొదట్నించీ తెలుసూ? తెలిస్తే ఆ వెధవనెందుకు చేరనిచ్చావూ? వాడితో స్నేహం యెందుకుచేశావూ? వాడితోస్నేహం శతృత్వంకటే కూడా చెడ్డది. ప్రమాదకరమైంది—

ధ :—ఏంచెయ్యనూ? విధిలేక చెయ్యవలసివచ్చింది. లేకుంటే వాడితో నాకేం సమ్మంధం? ఈడా, జోడా, సహవాసమా, మీ పిల్లగురించే కాకపోతే వాడితో స్నేహానికి నాకేంపనీ?

రా :—అదేమిటి? నీమాటలు నాకేం అర్థంకావడం లేదు. మాపిల్లగురించి నీకు వాడితోస్నేహమేమిటీ?

ధ :—అంటే, వారిద్దరూ తరుచుకలుసుకుండికి తగిన అవకాశం కలిగించడంకోసం.

రా :—నీసంగతి చాలా విపరీతంగావుంది! నీ భార్యను కలుసుకుండికి వాడికి నువ్వు అవకాశం కలిగించడం...వాడికేం అధికారముందీ?

ధ :—నాకేం అధికారముందీ!

న :—ఏమిటదీ? నీకేం మతుండే మాటాడుతున్నావా? నీకధికారం లేకపోవడమేమిటీ? నీభార్య—నీ యాజమాన్యంలో వుండవలసిందీ!

ధ :—ఆఁ! యాజమాన్యం! అన్నిటిపైనా యాజమాన్యం వహిస్తాం. వహించగలం. కాని, మానవహృదయాలపైని కూడా—!

సీ :—అన్నయ్యా! అయితే వొకవేళ అది యౌవన మదంచాత మత్తులోపడి పరాయివాడిమీద కన్నువేసిందే అనుకో! దాన్నెలాగో ఆ దృష్టినుంచి మళ్ళించడానికి ప్రయత్నిస్తావా? లేక గుండెమీద కుంపటిలాగు వాణ్ణికూడా యింటిమీద తెచ్చిపెట్టుకుని దానికి మరింత ప్రోత్సాహం కలిగిస్తావా?

ధ:—అయ్యోతల్లీ! నేనామాత్రం ఆలోచనాపాలోచనాలేకుండా ప్రవర్తించాననే కాబోలు నీ వుద్దేశం? ఆమెమనసు మళ్ళించడానికి, ఆమెను స్వాధీనం చేసుకుందికి యెన్నివిధాల యెంత ప్రయత్నించానో నీకేం తెలుసు? ఆమె యిక్కడికి వచ్చింది మొదలు ప్రతిరాత్రీ కూడా ఆగదిలో వొంటరిగాకూచుని యెప్పటికైనా ఆమె నాచెంతకు వస్తుందేమోఅని ఎంత ఆశతో, కాపీ నంతో నిరీక్షించేవాణ్ణి! చిన్న చప్పుడయ్యేసరికి ఆమె వస్తున్నాదేమోఅన్న ఆనందంతో గుండెలు దడదడా కొట్టుకునేవి, కాని—యెంతకీ ఆమెజాడే వుండేది

కాదు. రాత్రుళ్ళన్నీ అలాగే ఆమెనే ధ్యానించుకుంటూ హృదయాన్ని దహించే వుద్రేకంతో, నిరాశతో, యేమిటో తెలీని, చెప్పలేని, భరింపలేని బాధతో గడిపేవాణ్ణి. ఇహను తెల్లవారింది మొదలు తిరిగి సాయంత్రమయ్యే వరకూ కూడా ఆమెను వొదల్లేక, ఆమెనుంచి, ఆమె ముఖంనుంచి నా కళ్ళను తిప్పుకోలేక నా పనులన్నీ వొదులుకుని ఆమె చెంతనే కూచునేవాణ్ణి. అల్లా యెంతసేపు కూచున్నా, వొక్కసారన్నా నావేపు ముఖమేనా తిప్పేదికాదు. ఏదో దీర్ఘాలోచనలో పడ్డట్టు, మనసు మనసులోలేనట్టు, రాయిలాగు, మోడులాగు దిగాలుపడి కూచునేది. ఒక్కమాట, వొక్కనవ్వు, వొక్క చల్లనిచూపు, వొక్క సంజ్ఞకూడా ఆమెకు నామీద ప్రేమని నన్నెక్కడ భ్రమింపజేస్తాయో అని భయపడుతున్నట్టూ తోపించేది. ఇల్లా యెంతకాలమని? ఒక్కొక్కసారి ఆపుకోలేనంత దుఃఖంకలిగి యేడుపుకూడా వచ్చేది. ఆ వుత్తరక్షణంలోనే ఆమెపైని పట్టరానంత కోపం వచ్చేది. ఒక్కసారి ఆమెనంతా కాళ్లాచేతాకుమ్మెయ్యాలని బుద్ధిపుట్టేది. కాని కొంచెమాలోచిస్తే అంతకోపానికి ఆమె నాకుచేసిన అన్యాయమేమీలేదని నాకే తోచేది/నన్నూ, నా వెర్రితనాన్నీ చూసి తిరిగి నాకే సిగ్గువేసేది తరకు విసువెత్తేది. ఆ నారాయణమూర్తి వొచ్చేసరికి ప్రపంచంలోవున్న ఆనందమంతా వొక్కసారి ఆమెకు లభించినట్టూ పొంగిపోయేది. అతని ముఖం చూస్తూ వొళ్ళు మరిచిపోయేది. అతనితో మాటాడుతూ మాటాడుతూ ప్రపంచమంతా మరిచిపోయేది. అప్పటి ఆమె వుత్సాహం, ఆనందం చూడ్డానికి నాకే సరదావేసేది. ఇహను అతణ్ని రానివ్వక నేను చేసేదేముంది? ఆమె నాకోసం చెయ్యబడనప్పుడు ఆమెమనసంతా, హృదయమంతా అతనిమీదే వున్నప్పుడు అతణ్ని ఆటంకపర్చి లాభమేముంది! ఆమెనంటే పురోహితుని చేతుల్లోంచి పుచ్చుకున్నాను గాని ఆమెపైని నాకేం హక్కుంది? వొకవేళ మీరు భావించినట్టూ బలవంతాన ఆమెను స్వాధీనంచేసుకుందికి ప్రయత్నించినా ఆమెశరీరాన్ని నా ఆధీనంలో వుంచుకోగలను. కాని ఆమె మనసునీ, ఆత్మనీ, ప్రేమనీకూడా అరికట్టడం నా స్వాధీనంలోవుందా? ఆది మానవుల స్వాధీనంలోవుందా? అందుకు ప్రయత్నించడం వట్టి నీచమూ, నిష్ఫలమూ అని నా వుద్దేశం—

న :—మనస్సూ, ఆత్మానూ? మొదణ్ణించీ యిలాంటి వెర్రివేదాంతం పెట్టుకునే దానివొళ్ళు దానికి తెలీకుండాచేశావు. మనస్సు—అది కోతిలాంటిది. ఓ స్థిరంగా వుంటుందా? విచ్చలవిడిగా వొదిలిస్తే అచ్చువిడిచిన అబోతులాగ, చుక్కానులేని వోడలాగ దానిష్టమొచ్చినట్టూ గిరగిరా తిరుగుతుంది. దానికి కూడా కొంచెం అడ్డూ ఆపూ వుండాలి. లేకపోతే వుండేటట్టు చెయ్యాలి—

ధ (వీధిద్వారమువంక చూస్తూ):—అదిగో! వారంతా వొస్తున్నారు. (అందరూ సావిడికేసి చూస్తూవుంటారు.)

[అప్పుడు శ్రీనివాసరావూ, అతనివెనక కుమార్తె సుందరీ, ఆమెవెనక గోపాలం—సుందరి మేనమామా మెల్లగా వాకిట ప్రవేశిస్తారు.

శ్రీనివాసరావు సుమారు నలభై యేళ్ళవాడు. తెల్లని ఖద్దరుపంచా, లాల్చీ, పైమీద జామారు తువ్వాలా ధరించి వుంటాడు. చిన్నక్రాపూ సన్ననిమీసమూ వుంటాయి. సదా చిరునవ్వుతో నిండిన అతని పెదవులూ, నీళ్ళకంటె నిర్మలములైన విశాల నేత్రాలూ అతడు బహుశాంతిప్రియుడని చాటుతూ వుంటాయి. అతని ముఖములోనూ, ప్రతిమాటలోనూ యెంతో విమర్శనాదృష్టి గోచరిస్తూ వుంటుంది.

సుందరి—ఆమెకు పదహారేళ్లు దాటివుంటాయి. బొద్దుశరీరం. సామాన్యమైన పొడుగు. కుండ్రంగా నున్నగావున్న ఆ వెన్నెల చంపలూ, ఆ బుజాలవంపులూ, కండలూ ఆమె ఆరోగ్యాన్ని తెలియజేస్తూ వుంటాయి. విరబోసుకున్న ఆమె పెద్దజుట్టు నొక్కులు నొక్కులుగా సముద్రపు అలలచే కడగబడిన నల్లని యిసకవలె పిరుదులమీదకు వ్రేలాడుతూవుంటుంది. లేడిపిల్ల కళ్లకంటె

చంచలమైన నల్లని పాపలుగల పెద్దకళ్లూ, తీర్చినట్టూ ముక్కూ, తీరైన గులాబీ పెదవులూ, వాటిమధ్య తళతళలాడే పలువరసా, ఆ నున్నటి వొంటిమెరుపూ, పొడుగాటి సన్నని వేళ్లూ, వాటిచివర మెరిసేగోళ్లూ అన్నీ యెంతోముద్దుగా, ఆకర్షణీయంగా వుంటాయి. ఆమెధరించిన లేతగులాబీ చీరా, మబ్బునన్నె పొట్టిచేతులరవికా యెంతో నాజూకుగా కనబడుతూవుంటాయి. నిజానికి యేదుస్తులు వేసుకున్నా అందంగాకనబడే సహజమైన లావణ్యం, అవయవసౌష్ఠవం ఆమెలోనే వున్నవని చెప్పవచ్చును. కంఠస్వరం వీణమోగుతున్నట్టూ వుంటుంది. ఆమె వైఖరినిబట్టి ఆమె తప్పుపనిచేసినా నిర్భయంగానూ, బాహాటంగానూ చేసే రకములోనిదని మనం గ్రహించవచ్చును.

గోపాలం సన్నంగా, పొడుగ్గా, తెల్లగా వుంటాడు. ముఖంకోలన. అతణ్ణి చూడగానే గడుసువాడనీ, వ్యవహారస్థుడనీ సమయస్ఫూర్తి గలవాడనీ స్ఫురించుచుండును.

వారు సమీపించగానే ధర్మారావు లేచి 'రండి, దయచేయండి' అని శ్రీనివాసరావుకూ, గోపాలానికీ కుర్చీలు చూపిస్తాడు. శ్రీనివాసరావు నెమ్మదిగా బెంచీపైన కూచుంటాడు. అతనికి కుడిచేతివైపున గోపాలం, అతనిపక్కని ధర్మారావూ కూచుంటారు. శ్రీనివాసరావుకి యెడమవైపున బెంచీచివర నానుకుని తల్లికిదగ్గరగా తలవంచుకుని సుందరి నిలుచుంటుంది.]

రా (సుందరినుద్దేశించి తీవ్రంగా):— తల్లీ! వచ్చావమ్మా! కని పెంచినందుకు వుద్ధరిస్తున్నావు—అమ్మా! ఇవేబుద్ధులు కులానికీ కన్నవాళ్ళకీ కీర్తితెచ్చేవి—సాటివాళ్లో తలవంపులు...

సుందరి (నెమ్మదిగా తలయెత్తకుండానే):—అంత తలవంపులికి నేనేం తప్పుపనిచేశానూ?

రా :—అయ్యో! ఇంతకన్న యేం చెయ్యాలి! ఇంకా యిప్పుడుచేసింది చాలిందికాదూ? పైగా యేం చేశానని అడుగుతున్నావు! నీకేం యిల్లాంటి దుర్బుద్ధిపుట్టిందీ? చిన్నదానివా చితకదానివా? జ్ఞానంవచ్చి భర్తతో కాపరం చేస్తున్నదానివి ఆ పరాయివెధవతో...(నోరు నొక్కుకుని) సిగ్గుసిగ్గు...

సుం :—ఎవరు పరాయివాడూ?

రా (త్రుళ్ళుపడినట్టు):—ఆఁ! ఎవరా? ఆవెధవ పరాయివాడుకాక మరెవడూ? నీకేమౌతాడూ? సోదరుడా, బంధువా, ఆప్తుడా? ఆ పోకిరీవెధవతో నీకేం సంబంధంవుందని పరిగెత్తావూ! నాపరువు తియ్యడానికీ—నాప్రతిష్ట పాడుచెయ్యడానికీ—నా గౌరవం మంటగలపడానికీ—

సుం:—అమ్మా! నువ్వేమనుకున్నా సరేగాని అతను పరాయివాడని నా మనస్సెన్నటికీ వొప్పుకోదు—అతనే పరాయివాడైతే నాకీలోకంలో ఆప్తులేలేరు.

రా :—ఆప్తుల్లేరూ?...భర్త—?

సుం :—ఎవరు భర్తా?

రా (హఠాత్తుగా దెబ్బతిన్నదానివలె):—ఆఁ, ఆఁ...నువ్వేనా ఆమాటలంటున్నదీ? లేక యెదన్నా గ్రహంపట్టి నీచేత అలా పేలిస్తూందా? పండువంటి సంసారం, నిక్షేపంలాంటి భర్తా ప్రాప్తంలేదు కావోలు! ఎందుకిలాంటి దుర్బుద్ధి పుడుతూందీ? ఎవరు బోధిస్తున్నారూ?

గోపాలం :—అక్కయ్యా! నువ్వూరికే దాన్నలా బెంబేలెత్తించీడం యేం బాగులేదు. చిన్నపిల్లా—పాపం! తెలీక వొకవేళ తప్పుపనిచేసిందే అనుకో! దాన్ని సరిపుచ్చుకుని అమ్మా! అదితప్పు, అల్లాకూడదు. అని నెమ్మదిగాచెబితే అదే వినుకుంటుంది. అంతేగాని గుమ్మంలో కాలుపెట్టింది లగాయితూ ఛర్రూబుస్సూమని కూకలేయడం మొదలెడితే దానికేం తోస్తుందీ?

సుం:—మామయ్యా! నీధోరణిచూస్తే నువ్వుకూడా నేనేదో తప్పుపనిచేశానని భావిస్తున్నట్టుగా వుంది—కాని నేను చేసింది తప్పని నాకు బోధపడలేదు.

(కొదువ.)

—ఆకుండి సత్యనారాయణ.

# గాంధర్వము

## (ఏకాంకరూపకము.)

### (గతసంచిక తరువాయి.)

గో (కెమ్మదిగా):—నిజమేనమ్మా! బోధపడక నే చేశావు. తప్పని తెలిస్తే యెందుకుచేస్తావు? నీకుమాత్రం జ్ఞానంలేదా? అంత మూర్ఖురాలివా? ఇహ నేనా బుద్ధిగావుండి బంధువులలో మర్యాద తెచ్చుకో తల్లీ!

సుం (గర్వంతో):—మామయ్యా! నీకుకూడా నా సంగతి సరిగా అర్థంకానట్టుంది. నేనేదో తప్పుపని చేశానని నువ్వుకూడా చాలా విచారిస్తున్నట్టున్నావు. లోకులేమనుకుంటారో, బంధువులేమనుకుంటారో, సంఘం యేమనుకుంటుందో అని నాకోసం అమ్మా నువ్వూ చాలా దిగులుపడుతున్నారు. కాని, నాకోసం యెవరూ విచారించక్కర్లేదు. ఏవరేమనుకున్నా నాకేం లెఖ్ఖలేదు—

రా :—చాల్లే—నోరుముయ్యి! వెధవప్రతాపం... యింకా వాదిస్తున్నావు సిగ్గులేక...ఆడదానికి భర్తకంటే యేముందీ? భర్తను దైవంలాగు చూసుకోవాలి—

సుం :—అవును; ఎప్పుడో యెవడో మాయిద్దర్నీ కూచోబెట్టి అర్థంలేని, వున్నా తెలీని వాగుడేదో వాగేడని యెల్లకాలం యిష్టమున్నా లేకపోయినా పడియుండవ్వాలి—

రా :—అయ్యో! అయ్యో! ఏమిటిదీ? ఒళ్లుతెలిసే మాటాడుతున్నావా? వివాహమంటే యేమిటో నీకు తెలుసా?

సుం :—తెలీకేం?—మీ చేతులోవున్న బొమ్మని యింకొకరి ఆధీనంచెయ్యడం అన్నమాట! నేను చిన్నతనంలో నా ఆటబొమ్మని వుంచుకున్నట్టే మీరూ నన్ను తయారుచేశారు. నాకు ప్రాణం, మనస్సూ, ఆత్మా వున్నాయనే మీకు తట్టలేదు. లేకుంటే నాకంత చిన్నతనంలో వివాహంచెయ్యవలసిన ఆవశ్యకత యేమీలేదసలే వొకవేళ చేసినా నారాయణమూర్తిని తప్ప యింకెవరినీ చెయ్యవద్దనీ యాడవలేదూ?—

రా :—అవున్లే—

సుం :—వొద్దంటూవుంటే నన్నిలాకట్టేయడం మీకు న్యాయమేనా? నేనేం కోరుకున్నా నా, చేశానా? ఇప్పుడు నన్నిలా—

రా :—ఎంత కృతఘ్నురాలివే? నీసౌఖ్యం మాకేమీ అక్కర్లేనట్టూ మాటాడుతున్నావు! నారాయణమూర్తి! వాడెవడు? మనమెవరం? ఒకశాఖా, సాంప్రదాయమా, పోనీ ఆస్తా, వుద్యోగమా—బికారివెధవ!...నీకు మేమేం లోపంచేశామూ? నీ వివాహంగురించి మామయ్యా, నేనూ యెంత శ్రమపడ్డామూ? శాఖశాఖ అంటేట్లోనూ యిటువంటి సంబంధంలేదని మన అదృష్టానికి బంధువులందరూ యెంత అసూయపడ్డారూ?...ఇతనికేంలోటూ? కురూపా? కుంటా, గుడ్డా, దరిద్రుడా? ఏం తక్కువైందనీ—యిష్టంలేకపోవడం? నిక్షేపం—నిధి—ఎటువంటి సమస్థానం!

సుం :—అతను గొప్ప ఆస్తిపరులని నాకు తెలుసు. దాన్నంతట్నీ యెల్లా ఖర్చుచెయ్యడమో వూహించడానికికూడా అవకాశంలేనంత ఆస్తి అతనికుంది. కాని—

రా (ముఖంచిట్లించి):—కాని—యేమిటి?

సుం :—ప్రేమకి ధనం అవసరమన్నసంగతి నాకింకా బోధపడలేదు.

రా :—అయితే ఆ బికారి పై—

సుం :—కాదు—అతనే నా ఆస్తి, నా ప్రభువు; నా ప్రాణాలన్నీ సంతోషమంతా అతనే. ఎన్నో జన్మలతరబడిచేస్తున్న నా పుణ్యఫలం. నా జీవనానికి వెలుగు. అతను లేకపోతే నాకు జీవించవలసిన అవసరం యేమీలేదు.

గో (బుజ్జగిస్తున్నట్టు):—అమ్మాయి! తొందర పడకు! బాగా ఆలోచించు! నీ శ్రేయస్సుమకోరే చెబుతున్నాం కాని నీమీద మాకేం పగలేదు. నీ సౌభాగ్యానికి నువ్వే అడ్డుతగులుకోకు!...ఇంతధనం, యీ మేడలూ, నగలూ—

సుం (హేళనగా):—ధనం! మేడలు! నగలు! వీటితో నే నేమిటి చేసుకోడం? ఇవి మానవునికి సౌభాగ్యాన్నిస్తాయి! ఇవ్వగలవు! ధనాన్నిబట్టి మానవులకు విలువకడతారు! ప్రేమకి వెలకడతారు! ద్రవ్యంకోసం మానవుల్ని ప్రేమించాలి—వరించాలి! వద్దువద్దు నాకా ప్రేమతో సంబంధంలేదు. నాకాధనం అవసరంలేదు—

రా :—అరెరె! ఏమిటి మూర్ఖత? పరువూ, మర్యాదా, ప్రతిష్ఠా—

సుం (గర్జించినట్టు):—పరువు! మర్యాద! ప్రతిష్ట! ఎవరు వాటిగురించి తలబెడుతున్నదీ? ప్రేమకంటె మధురమైంది, అంతకంటె బలమైంది, దానికంటె వుత్కృష్టమైంది నాకీ లోకంలోగాని పరలోకంలోగాని యేమీలేదు. దానికోసం సంఘం, సంపత్తి, పరువూ, మర్యాదా, ప్రతిష్టా, మతమూ, నీతీ, పవిత్రతా అన్నీ వొదులుకుంటాను. ప్రేమరహితమైన, స్వేచ్ఛావిరహితమైన స్వర్గంకూడా నా కక్కర్లేదు.

రా :—నీకేదో కొంచెం పిచ్చెత్తినట్టావుంది.

ధ :—అవును; ప్రేమ చాలామందిని పిచ్చివాళ్ళను చేస్తుంది.

రా (పళ్లుబిగిస్తూ):—ఊం, ప్రేమ! దీని కెంతుం— యేమ్మహా అందంగా వెలిగిపోతున్నాడనీ?

ధ :—అత్తా! మనమట్టుకి అతన్లో విశేషమైన అందం యేమీ గోచరించకపోవచ్చును. మనకతడు సామాన్యంగానే కనబడవచ్చును. కాని, వొక్కొక్క హృదయ మొక్కొక్కరూపంపైని వాలుతుంది. అప్పుడారూపం—ఆ వొక్కరూపమే యెన్నటికీ చెరగకుండా ఆ హృదయంలో నాటుకపోతుంది—

రా :—ఆఁ. యేడుస్తుంది.

(అప్పుడుసాకిట్లోనుంచి 'ధర్మం' అన్నపిలుపు)

ధ :—వస్తున్నా.

రా :—ఎవరూ?

ధ :—నారాయణమూర్తిలాగుంది—

రా (మండిపడుతూ):—ఆ వెధవిక్కడికికూడా వస్తున్నాడూ? ఇంకా సిగ్గులేక...పొమ్మను...గెంటి అవతలకి...ఆ పాడుమొహం నాకంటపడనీకు..నే చూడలేను—

సుం (నెమ్మదిగా):—నాన్నగారూ! నారాయణమూర్తి యిక్కడికి రావడానికి తగినంత యోగ్యుడు కాడూ?

శ్రీనివాసరావు (శాంతంగా):—అతడు చాలా మంచివాడనే నా వుద్దేశం. అతనెంత బుద్ధిమంతుడో అంతయోగ్యుడు.

సుం :—అయితే అతనిరాకకి మీ అభ్యంతరం—

శ్రీని :—లేదమ్మా! నాకేం అభ్యంతరంలేదు—సరి కదా అతను రావాలనే నేను కోరుతున్నాను. కాని, యిది మనయిల్లుకాదు; ధర్మారావుగారు యిష్టపడితే అతనిరాకకి నేను చాలా సంతోషిస్తాను.

ధ :—నాకేం అభ్యంతరం! ఇదిగో తీసుకు వస్తున్నా.

[ధర్మారావు చరచరావెళ్ళి నారాయణమూర్తి రెక్కపట్టుకుని మెల్లగా ప్రవేశిస్తాడు.

నారాయణమూర్తి—ఆకుపచ్చ పట్టంచుల ఖద్దరుపంచా, గుండ్రబొత్తాముల కంటె మెడఖద్దరులాల్చీ, పైమీద తెల్లగులాబీ ఖద్దరు వుత్తరీయం వల్లెవాటుగా ధరించి వుంటాడు. అతని రూపమునుబట్టి వయస్సు యిరవై అన్నయెడల అంతేనాఅనీ, యిరవైరెండూ, యిర్వైమూడూ అన్నయెడల అంతవుండదేమోననీ తోస్తూవుంటుంది. వుంగరాలుతిరిగిన పొడుగాటి నల్లనిక్రాపూ, అంతకంటె నల్లగా తళతళలాడే పెద్దకళ్లూ, చివర కొంచెం వంపుతిరిగిన చురుకైన మూది ముక్కూ, చిరునవ్వులొలికే పెదవులూ, ఆ తెల్లముఖమూ, నాజూకైనవొళ్లూ అన్నీ

అతడు చాలా అందమైనవాడని చెప్పక చెబుతూవుంటాయి. వెయ్యిమందిలోవున్నా అందరికళ్లూ ముందుగా అతనిమీద వాలుతాయి.]

రా (వారు సమీపిస్తూవుండగా వుద్రేకంతో):— అయ్యో. ఆ వెధవనెందుకు తీసుకువస్తున్నావు? గెంటీడం మానీసి...(కోపంతో వుత్తేజితురాలై పళ్లు బిగిస్తూ) పాపాత్ముడు...ఛండాలుడు...యే మొహం పెట్టుకువస్తున్నాడు—

ధ (నెమ్మదిగా):—అత్తా! అతనిపై యెందుకూ కోపం! అతని తప్పేముందీ యిందులోనూ? బాల్యం మంచీ యిద్దరూ చనువుగా వొక్కచోట మెలగడం వల్ల అతనికి సహజంగా మీపిల్లపైని ప్రేమ జనించింది. మీపిల్ల యేమాత్రం వుపేక్షవహించినా, ప్రతిప్రేమ చూపకపోయినా అతనిప్రేమ క్రమంగా తగ్గిపోయివుండును. కాని, మీపిల్లకుకూడా ఆవిధంగానే అతనిపైన మనస్సున్నట్టూ తెలుసుకోవడంవల్ల అతనిప్రేమ క్రమంగా అభివృద్ధిచెందింది. ఈ విషయంలో అతను సహజస్వభావాన్ని అనుసరించివెళ్ళాడు. అతని దోషమేముందీ?

గో:—ఔను దీనిలో బుద్ధిలేకపోతే అతణ్ణి నిందించడం యెందుకూ? దీని కీపాడుబుద్ధి లేకపోతే అతను చేరగలడా?

(ఇద్దరూ బాగా సమీపిస్తారు. నారాయణమూర్తి నుద్దేశించి)

రా (వుద్రేకం అణుచుకుంటూ):—బాబూ! నువ్వు మాకు బంధువుడవుగాని, అప్తుడివిగాని కావుగదా?

నారాయణమూర్తి:—కాను—

రా:—అయితే యేమిటీ బాబూ! యీ వ్యాపారమంతానూ!

నా:—ఏం వ్యాపారం?

రా:—ఏం వ్యాపారమా? మాపిల్లతో యెందుకూ నీకీగొడవంతానూ? అది ఆడదీ, భర్తతో అత్తవారింట్లో కాపరంచేస్తున్నదీనూ. నువ్వు మంచి బుద్ధిమంతుడివీ, ప్రాజ్ఞుడివీ, బాగా చదువుకున్నవాడివీను. దాన్నీ, దాని సంసారాన్నీ యిలా పాడుచెయ్యడానికి ప్రయత్నించడం న్యాయమేనా!

నా (తలవాల్చుకుని నెమ్మదిగా):—నే నేంచేశానూ? బాల్యంనుంచీ మీపిల్లా నేనూ యెంతచనువుగా, యెంతస్నేహంగా తిరిగేవాళ్ళమో మీకు తెలీదూ? ఎప్పుడూ వొక్కచోటేవుంటూ, కలిసి పికార్లువెళుతూ—

రా:—నిజమేబాబూ! బాల్యంలో మీ యిద్దరూ చాలా స్నేహంగావుండేవారే అనుకో! కాని అదింకా చిన్నపిల్లకాదుకదా? భర్తతో కాపరంచేస్తున్నపిల్ల. దాన్తో యిప్పుడుకూడా నువ్విలా ప్రవర్తించడంలో కాని కేంబాగుంటుందీ! అందువల్ల దాని కనేక చిక్కులొస్తాయి. దాని కాపరానికికూడా నీళ్ళధారై పోతుంది. నీకంటే యింకా పెళ్ళికాలేదు; కాని, మీ యింట్లోకూడా ఆడబిడ్డలున్నారుకదా? వాళ్ళుకూడా యిలాగే కట్టుకున్నభర్తల్ని విడిచిపెట్టి పరాయివాళ్ళతో పికార్లుకొడుతూవుంటే నువ్వు సహించగలవా? అప్పుడు నీకెంత కష్టంగావుంటుంది? ఇదిగో నీ పెద్దలకు లక్ష నమస్కారాలు. నాకీలోకంలో యీపిల్లకంటె యెవ్వరూలేరు. దీన్ని విడిచిపెట్టు బాబూ, నీ పుణ్యముంటుంది. నీకేం, మొగవాడివి. ఎల్లాతిరిగినా చెల్లుతుంది. పండువంటి దాని కాపరానికి మాత్రం యెసరుపెట్టకు బాబూ! (దీనంగా) నిన్ను బతిమాలుకుంటాను. నీపాదాలు పట్టుకుంటాను.

[నారాయణమూర్తి స్థంభితుడై పోతాడు. ఇంకేమీ మాటాడలేక ముఖం వాల్చుకుని వెనక్కిమళ్లిపోతాడు. మెల్లగా వీధిద్వారము వరకూవెళ్లి వుండపట్టక ముఖం వెనక్కుతిప్పి అశ్రుజలాల్లోనుంచి సుందరివైపొక్కసారి జాలిగాచూస్తాడు. అంతవరకూ అతణ్ణే అనుసరిస్తున్న సుందరికళ్ళనిండా నీళ్లూనుతాయి. ఆమె చిన్న నిట్టూర్పువుచ్చి దోసిటితో ముఖం కప్పుకుంటుంది. అంతలోనే చటాలునలేచి రుద్ధకంఠంతో 'అబ్బాయి!' అని పిలుస్తుంది. వొదల్లేక వొదల్లేక

వెళ్ళిపోబోతున్న నారాయణమూర్తి చటుక్కున ఆగిచూస్తాడు.]

సుం :—ఉండు. నేనూ వొస్తున్నాను.

(ఆమె లేచి మెల్లగా కలలో నడుస్తున్నట్టు నడుస్తూ నారాయణమూర్తి దగ్గిరికి వెళుతూ వుంటుంది.)

గో :—సుందరీ! తొందరపడకు తల్లీ! మేమందరం నిన్నెంతముద్దుగా, గారాబంగా చూసుకుంటున్నామో నీకు తెలీదూ? లావణ్యరేఖలాగు నువ్వు నీభర్తతో కలిసి కాపురంచేస్తూవుంటే మాకెంత ఆనందంగా వుంటుంది. నీభర్త నిన్నెంతలా ప్రేమిస్తున్నాడు. నీకోసం, నీ సౌఖ్యంకోసం యేం చెయ్యమన్నా చెయ్యగలడు. అతణ్ణి వొదిలివెళ్ళడానికి నీ మనస్సెలా వొప్పుకుంటూంది? అతనికెంత కష్టంగావుంటుంది?

సుం :—నన్నింత హృదయంలేనిదానిగా మీరు భావిస్తే నేను సహించలేను. అతనికికలిగే మనఃకష్టానికంతకూ నేనే కారకురాలినని తలుచుకున్నప్పుడల్లా నాకెంత విచారంగావుంటుందో చెప్పలేను. కాని, యేం చెయ్యను. వొకరిని ప్రేమించడం కాని ప్రేమించకపోవడం కాని నా శక్తిలోవుంటే యెంత బాగుండును? కాని లేదు—అది నా శక్తిలోలేదు. నేనెంత ప్రయత్నించినా నారాయణమూర్తినుంచి నా మనసుని మళ్ళించుకోలేకపోతున్నాను. ఒక్కక్షణం అతను నాచెంత లేకపోతే నాకుకలిగే ఆ వోర్చుకోలేని దుఃఖం, ఆ ప్రాణాలుచీల్చే బాధా మీకు తెలీదు. నాకెంత బాధకలిగినా అతని ఆనందానికిమాత్రం భంగం కలగనివ్వకూడదన్న సద్బుద్ధి యింతవరకూ నాలో పుట్టలేదు. యేం కర్మమోగాని—పోనీ, వొకవేళ నారాయణమూర్తిపైని నా ప్రేమనీ, మోహాన్నీ చంపుకుని ప్రేమరహితమైన మొండమునై యితనిలోవుంటేమాత్రం యితనికేం సౌఖ్యం యివ్వగలను?

గో :—అతను నిన్నింత ప్రేమిస్తున్నందుకేనా అతనిపైని ప్రేమకనబర్చడం నీకు పరమకర్తవ్యం. అంతకన్న నేనేం చెప్పలేను.

సుం (నెమ్మదిగా):—నాలోలేనిదీ నేనెలా చూపగలను? అది నా స్వాధీనంలోలేదని మీకు కొన్నిసార్లు చెప్పాను.

రా :—అయితే అంతే...

సుం :—ఏంచెయ్యనూ?

రా :—అయ్యో! అయ్యో! ఏమిటీ మూర్ఖత? కొంచెం కళ్ళువిప్పిచూడూ! లోకులూ, బంధువులూనీ గురించి యేలా చెప్పుకుంటున్నారో!

సుం (గర్వంతో తీవ్రంగా):—లోకులు! లోకుల అభిప్రాయంకోసం కనిపెట్టుకు కూచోలేను—బంధువులు! నా అంతరాత్మనివంచించి బంధువుల్నందర్నీ మెప్పించేశక్తి నాలోలేదు. ఇతర్లేమనుకుంటారో అని నా స్వభావానికి వ్యతిరేకంగా నటించడం నావు చాతకాదు—

రా :—ఛీ—ఛండాలురాలా! కృతఘ్నురాలా!... నా కడుపున చెడపుట్టేవు—

శ్రీనివాసరావు (నెమ్మదిగా):—ఎందుకంత కోపం దానిమీద?

రా (తీవ్రంగా):—కోపమెందుకూ? కడుపు నిండిపోతూంది మీపిల్లను చూస్తే...సిగ్గులేకపోయింది—యింకా వెనకేసుకురావడానికి—

సుం :—అమ్మా! దేముడు నన్నిలాచేశాడు. నేను దుర్మార్గురాలిననీ, కృతఘ్నురాలిననీ నీ యిష్టంవచ్చినట్టూ తిట్టు, నిందించు లోపల వొకవిధంగావుండి పైకోవిధంగా నటించేపాటి తెలివితేటలు నాలోలేవు. నన్నీవిధంగా నలుదెశలనుంచీ బంధించడం నేను సహించలేను (ఏడుస్తుంది).

శ్రీ (నెమ్మదిగా):—అమ్మాయి! నీకు వాళ్ళతో మాటాడవలసిన అవసరం యేమీలేదు. ఇలారా తల్లీ!

(సుందరివచ్చి తండ్రిచెంత తలవాల్చుకుని కూచుంటుంది. తిరిగి వెళ్ళిపోడానికి వుద్యుక్తుడవుతున్న నారాయణమూర్తిని శ్రీనివాసరావు ఆదరంతో 'నారాయణమూర్తీ రావోయి వెళ్ళిపోదువుగాని' అని పిలుస్తాడు. నారాయణమూర్తి నెమ్మదిగా రాగా శ్రీనివాసరావు ఆదరంతో అతణ్ణి

తనపక్కనే కూచోబెడతాడు. ఒకటి రెండు నిముషాలు యెవరూ మాటాడరు. శ్రీనివాసరావు కనుబొమ్మలేవో ఆలోచనచేస్తున్నట్టు వంపుతిరిగివుంటాయి.)

శ్రీ (ధర్మారావునుద్దేశించి):—బాబూ! నీకు కష్టంగాలేకపోతే వొకటిరెండు విషయాలు మాటాడదలుచుకుంటున్నాను.

ధ:—నాకేంకష్టం? మీ వ్యావహారిక విచక్షణయందూ, నిష్పాక్షిక బుద్ధియందూ, విమర్శనాదృష్టియందూ నాకు సంపూర్ణవిశ్వాస ముంది.

(శ్రీనివాసరావు వొకటిరెండు నిముషాలు మౌనం వహిస్తాడు.)

శ్రీ (సుందరినుద్దేశించి):—అమ్మాయి! నువ్వు నారాయణమూర్తిని విడిచివుండలేవు?

గో (చిరాకుతో):—ఏమిటా ప్రశ్న? మతిపోయిన ప్రశ్న. ఆలోచనా పాలోచనాలేకుండా. విడిచివుండలేదు! వుండలేకపోతేమట్టుకు వాడికిచ్చి పెళ్ళిచేస్తారేమిటి? నీసంగతి నాకేం అర్థంకాకుండా వుంది. ఏమిటా తొందర?

శ్రీ (మృదుస్వరంతో):—బావా! నేనేం తొందరపడలేదు. బాగా ఆలోచించే మాటాడుతున్నాను. వివాహానికన్నిటికన్నా వధూవరుల ప్రేమే ప్రధానమైందని నా అంతరాత్మ బోధిస్తూంది. వారిద్దర్లో యెవరికి ప్రేమ లేకపోయినా సుఖానికి వెలితి వారిని కలిపివుండమని నిర్బంధించడం కేవలం అన్యాయం. సుందరీ, నారాయణమూర్తీ యిద్దరూ వొకర్నివొకరు విడవలేకుండా యెవరిమట్టుకువారు తమ్ముతామే మరిచి రెండోవారుగా మారి యింత గాఢానురాగనిమగ్నులై వున్నప్పుడు అది సహజమనీ, న్యాయమనీ మనకి తోచినప్పుడుకూడా మన పిరికితనం, సందేహం కారణంగా వార్ని అడ్డుపెట్టడం యెంతమాత్రం ధర్మంకాదు.

గో:—అయితే వారిద్దరికీవున్న యీసంబంధం మీకుకూడా యిష్టమే అన్నమాట?

శ్రీ:—ఇష్టమో అయిష్టమో నే చెప్పలేను. కాని తల్లితండ్రులమైనంతమాత్రాన వారి స్వేచ్ఛనీ స్వాతంత్ర్యాన్నీ శాశ్వతంగా అరికట్టడానికి మనకేం అధికారం లేదు.

రా:—బాగుంది...

శ్రీ (అటుచూడకుండా):—అమ్మాయి! అయితే నారాయణమూర్తిని వివాహంచేసుకోడం నీ కిష్టమేనా?

సుం:—ఈ విషయంలో మీ మనస్సుకికూడా యెక్కడ బాధకలిగిస్తానో అని భయపడుతున్నాను.

శ్రీ:—ఏమమ్మా! ఎందుచేత? నాకేం కష్టంగా వుండదు. చెప్పుతల్లీ నీమనసులో వున్నదేమిటో.

సుం (తలవంచుకుని):—నాకతన్ని వివాహంచేసుకోవాలని లేదు.

నా (విస్మయంతో):—ఏం? నామీద నీకిష్టం లేదూ? —ప్రేమలేదూ?

సుం:—ఇష్టంలేదూ? ప్రేమలేదూ? అబ్బాయి! ఏమిటా అడగడం? నీకన్న ప్రేమించతగ్గవారు నాకీ లోకంలో ఎవరున్నారూ? నా హృదయంలోని ప్రతీనాడీ నీకోసమే కొట్టుకుంటున్నసంగతి నీకు తెలీదూ? ఆహారం, నిద్రా, గాలీ లేకపోయినా కొంతకాలం జీవించగలనేమో కాని నువ్వులేందే వొక్కనిముషంకూడా జీవించలేను. రాత్రీ, పగలూ, నిద్రలోనూ, కలలోనూకూడా నువ్వే నా తలపులో వుంటావు. ఎప్పుడూ నీముఖంచూస్తూ నీ పక్కనేవుండి పోవాలనుంటుంది.

నా (ఆనందంతో):—నిజం! నన్ను సంతోషపెట్టడానికంటున్నట్టుంది.

సుం:—అబ్బాయి! నామాటల్లో నీకామాత్రం విశ్వాసంలేదూ? నా ప్రేమనంతట్నీ మాటల్లోకి తర్జుమాచేసి నీకు తెలియచేయగలిగితే, నీకు నమ్మకం పుట్టించగలిగితే యెంతబాగుండును? కాని ఆ శక్తి నాకులేదు. నాకే నీమీద అంతప్రేమలేకపోతే, అంత కాంక్ష లేకపోతే యింతప్రయత్నంచేసి నీదగ్గిరికి వస్తానా? ఇంత త్యాగంచేసి, యింత నిందకోర్చి నిన్ను నావాణ్ణి చేసుకుండికిలా ప్రయత్నిస్తానా? నీమీద నాకెంత వెర్రి మోహమో నీకు తెలీదు—

నా :—అయితే నన్ను వివాహం చేసుకుంది కెందు కిష్టపడేవు?

సుం :—ఎందుకా?—ఎప్పుడో పసితనంలో నాకు సరిగా జ్ఞానంలేనప్పుడు నా యిష్టంలేకుండా చేసిన సంబంధం వొదులుకుంటేనే యింతఅల్లర జరిగింది. అలాంటిది—నేను సహజంగా చేసుకున్నభర్తతో యెప్పుడేనా విడిపోవలసివస్తే సంఘం నన్ను బతకనిస్తుందా?

నా :—ఇంతసహజమైన, గాఢమైన మన ప్రేమకి కూడా యెందుకు విఘాతంవస్తుంది!

సుం :—ఏమో! ఎందుకేనా రావచ్చు. అట్టే వెర్రి తీపి తింటే వెగటులో దినట్టు-

నా :—అంటే నే నెప్పుడేనా నీకు విసుగు పుట్టిస్తానేమోననా!

సుం :—నువ్వు నాకు విసుగుపుట్టించకపోవచ్చును. నేనేనీకు విసుగు పుట్టించవచ్చు. ఇప్పుడంటే నువ్వు నన్నింత ప్రేమతో చూస్తున్నావు. ఒకవేళ నీప్రేమ దృష్టి యెప్పుడైనా యింకొకరిపైపు ప్రసరిస్తే? అప్పుడు నాకు చాలాకష్టంగాయుంటుంది. లేదా నామనస్సే నా స్వాధీనంతప్పి యింకెవరిచేతనైనా ఆకర్షింపబడ వచ్చును. ఇప్పటికి నాప్రాణంకంటె అధికంగా నిన్ను ప్రేమిస్తున్న సంగతి నీకు తెలుసు. ఈప్రపంచంలో నువ్వు నాపక్కనుంటే పరపురుషుని నీడకూడా చూడకపోయినా నాకు చింతలేదు. కాని మన యీ ప్రేమ ఎప్పుడూ యిలాగే స్థిరంగాయుంటుందని యేమీనమ్మకంలేదు.

నా :—నీ కటువంటి అనుమానం కలగడానికి కారణం యేమీలేదు-

సుం :—ఎందుకు లేదూ? ఎంతమంది ప్రాణ స్నేహితులు పరమ శత్రువులుగా మారిపోలేదు. లక్షల కొలదీ, కోట్లకొలదీ ప్రజలచాత ఉత్తమోత్తములుగా గణింపబడిన యెంతమంది నాయకులు స్వల్పకాలం లోనే పరమనీచులుగా భావింపబడి తిరిగి ప్రజల అవిశ్వాసానికి పాత్రులుకాలేదు? ఎంతమంది భార్యాభర్తలు మొదట యెంతో అనురాగంతో యుండి తరువాత వొకరొన్కరు అసహ్యించుకుని దొమ్ములాటల్లోకి దిగలేదు? ఇవన్నీ కళ్ళారా చూస్తూ ప్రేమ స్థిరంగా యుంటుందని యెలాగా నమ్మడం? ప్రేమ రహితమైన, రసవిహీనమైన జీవితం వొక్కనిముషం నేను గడపలేను. ప్రేమ పోగానే విడుదలయ్యే స్వేచ్ఛ యుంటేనే గాని నేను వివాహంచేసుకోను.

శ్రీ :—అమ్మాయి! అయితే దానికోసం వివాహం మానుకోడ మెందుకూ? ఎంతవరకూ అన్యోన్యం ప్రేమ వుంటే అంతవరకే కలిసివుండండి! ఎప్పుడిద్దర్లో యే కారణంచాత యెవరికిష్టంలేకపోయినా విడిపోవచ్చును. ఇష్టంలేనప్పుడు కలిసివుండి మాత్రం యేంప్రయోజనం?

గో (హఠాత్తుగా దెబ్బతిన్నట్టు) :—శావా!...

శ్రీ (నెమ్మదిగా) :—శావా? నువ్వింత ఖంగారు పడవలసిన అవసరం యిందులో యేమీలేదు. ఒకస్త్రీ, వొకపురుషుడూ అన్యోన్యం ప్రేమించుకుని పరస్పరాభివృద్ధికిగాని, సంఘాభివృద్ధికిగాని భంగం కలుగనట్లుగా దాంపత్య సౌఖ్యం అనుభవించడమే వివాహంయొక్క ముఖ్యోద్దేశం, ప్రేమలేంది దాంపత్యసౌఖ్యంలేదు. అందుచాత యిష్టంలేని యిద్దరు స్త్రీపురుషులను వివాహమాడమని నిర్బంధించడం యెంతపొరపాటో, పెళ్ళి చేసుకున్నా, దంపతులలో యెవరికేనా యిష్టంలేక విడిపోవాలని కోరుకున్నప్పుడు వారిని కలిపియుండమని నిర్బంధించడంకూడా అంత పొరపాటే. ఈ రెండింటిలోనూ కూడా వివాహోద్దేశం సరిగా ఫలించలేదనే చెప్పవచ్చును.

గో :—అయితే యెప్పుడుపడితే అప్పుడు విడిపోయే దానికీ యెవరితోపడితే వారితో పోయేదానికీ వివాహం కూడా యెందుకూ? వివాహమనేదే తీసేస్తే నయం.

శ్రీ :—వివాహమనేది లేకపోవడం చాలా ప్రమాదం.

గో :—ఎందుచాతా?

శ్రీ :—వివాహమంటే మరేంలేదు. ఒకస్త్రీ వొక పురుషుడూ యిష్టపడి దాంపత్యసౌఖ్య మనుభవించడానికి నిశ్చయించుకున్నప్పుడు వారికున్న సంబంధం సంఘంయొక్క వొప్పుకోవడమే.

గో :—సంఘానికి వారిపైనేమీ అధికారంలేనప్పుడు సంఘం రెండుట ఒప్పుకోవలసిన అవసరం వారికేముంది ?

శ్రీ :—స్త్రీపురుషుల ఆంతరంగిక సంబంధంపైని సంఘాని కేమీ అధికారం లేకపోయినా ఆసంబంధానికి ఫలరూపమైన సంతానంమాత్రం సంఘానికి చెందింది కావడంచాత ఆసంతానంయొక్క తల్లితండ్రులను తెలుసుకుని, ఆబిడ్డలను రక్షించడం, పోషించడం మొదలైన తల్లితండ్రుల బాధ్యతలను నిర్ణయించి, ఆతల్లి తండ్రులపైని తత్సంతానానికి గల హక్కులను సంరక్షిస్తుంది సంఘం.

గో :—సంఘం వారి హక్కుల నెంత రక్షించినా తల్లితండ్రులలో యెవరులేకపోయినా ఆశిసువులకు కలిగే లోపాన్ని సంఘం యెంతమాత్రం సవరింపజాలదని నువ్వింకా తెలుసుకోవలసుంది.

శ్రీ :—నువ్వన్నమాట నిజమే; పిల్లలకి తల్లీ, తండ్రీ యిద్దరూ సమానమైన అవసరమే అవడంచాత యిద్దర్లో యెవరులేకపోయినా ఆ పిల్లలకు కొంతలోపమేనని ఒప్పుకోక తప్పదు. కాని, సాధారణంగా స్త్రీ పురుషులు మొట్టమొదట యెంత స్వార్థపరులైనా బిడ్డ పుట్టేక వాళ్ళలో నిజమైన నైంకార్యత్వం సహజంగా కలుగుతుంది. బిడ్డ యిద్దరికీ ప్రాణసమానమైన వస్తువే. కాబట్టి దానికోసం భార్యాభర్త లిరువురూ వారిసౌఖ్యం చాలావరకు వొదులుకుంటారు. అప్పుడు కూడా దంపతులలో యేకారణంచాతనైనా యిష్టం లేక యెవరేనా విడిపోదలుచుకుంటే అడ్డు పెట్టడానికి సంఘాని కేమీ హక్కులేదు. అది కేవలం ఆదంపతుల అంతరాత్మలపైనీ, ధర్మంపైనీ ఆధారపడి వుంటుంది. కాని అల్లా విడిపోదలుచుకున్న దంపతులలో వొకరివల్ల వొకరికి యెటువంటి అన్యాయం జరగకుండా మాత్రం సంఘం చూస్తుంది, అలాగునే పిల్లలగురించి ఆదంపతులకున్న బాధ్యతను వొదులుకుందికికూడా సంఘం వొప్పుకోదు.

గో :—అయితే సుందరీ నారాయణమూర్తి వివాహంచేసుకోడం నీకు సమ్మతమే !

శ్రీ :—దానికి నాసమ్మతితో యేమీసంబంధంలేదు.

గో :—వారి వివాహానికి నీఅంగీకారం వుంటుందా?

శ్రీ :—వారిద్దరూ యిష్టపడి వివాహం చేసుకుందికి సిద్ధపడ్డప్పుడు ఆ పని అన్యాయంకానప్పుడు అంగీకరించడమే మంచిదని నా అంతరాత్మ బోధిస్తూంది. ఇటువంటి స్థితిలో వార్ని ఆశీర్వదించేవారు నాకంటె యెవరున్నారు ?—ఈవిషయంలో ధర్మారావుగారికి కష్టంగాయుంటుందేమోనని విచారిస్తున్నాను.

ధ :—లేదు—నాకు మీరనుకున్నంత కష్టంగా లేదు. మీకుటుంబంతో నాకున్న సహవాసంమూలాన మానవ ప్రకృతిలోని సత్యాన్ని గ్రహించకలిగినందుకు వొకవిధంగా నాకు సంతోషంగాకూడా వుంది.

శ్రీ :—అయితే నాకు మరేమీ చింతలేదు.

నా (చిరునవ్వుతో సుందరినుద్దేశించి) :—యేం? ఇప్పుడిష్టపడిందా అమ్మాయి—

[సుందరిచెక్కిళ్లు చప్పున యెర్రబారుతాయి. సిగ్గుతో తలవంచుకుని సఖంమూసిన కళ్ళతో అతని ముఖంవంక చూస్తూ వుంటుంది.]

నా (ఆమెకళ్ళలోకి చూస్తూ) :—ఆనందంగా వుందా ?

సుం (చిరునవ్వుతో కొంచెంగా కళ్ళెత్తి చూస్తూ) :—ఆనందం కాకేం ?

[శ్రీనివాసరావు నిలుచుని వారిద్దరి బుజాలపైనీ చేతులువేసి ముద్దుగా నిమురుతూ దరికి తీసుకుంటాడు. ఇరువురూ అతని పాదాలకు వంగి నమస్కరిస్తారు. అతడు నెమ్మదిగా వారిద్దర్నీ లేవనెత్తుతూవుంటాడు. మాధవీలత పైనుంచి రెండుపువ్వులు వారి శిరసులపైని రాలుస్తుంది.]

(తెరవాలుతుంది.)



—ఆకుండి సత్యనారాయణ.